# నిజం

—లక్ష్మి హరిబండి

రవి రెండు బస్సులు మారి చచ్చీ చెడి ఏడు గంటలకు ఎట్లాగయితేనేం ఆఫీసు నుండి ఇల్లు చేరుకున్నాడు. ఆరేళ్ల కూతురు రమ్య గేటుముందు తన స్నేహితురాలితో కలిసి ఆడుకుంటుంది. తలుపు బార్లా తీసి ఉంది. లోపల ముందుగదిలో పదేళ్ల కొడుకు ప్రదీప్ టీవిలో స్పోర్ట్స్ చూస్తూ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించే స్థితిలో లేడు. అతడు తండ్రి లోపలికి రావటాన్ని గమనించనే లేదు. సరే, బూట్లు విప్పి లోపలి గదిలోకి వెళ్లాడు రవి. శ్రీమతి జాడా ఎక్కడా లేదు. ఈ మహా ఇల్లాలు ఏమైనట్టు చెప్మా అనుకుంటూ కొడుకుని అడిగాడు.

'ఏరా నాన్నా, మమ్మీ ఎక్కడికెళ్లిందిరా?'

'ఎక్కడికో బయటకెళ్ళింది డాడీ', చూపును టీవీ మీద నుండి మరల్చ కుండానే సమాధానమిచ్చాడు పుత్రరత్నం.

ఈ వేళప్పుడు పిల్లలిద్దర్నీ వాళ్ల మానాన వాళ్లను వదిలేసి ఒంటరిగా వెళ్లవలసిన రాచకార్యం ఈవిడకు ఏమొచ్చి పడిందబ్బా అనుకుంటూ వంటింట్లోకి వెళ్లాడు రవి. టీ నీళ్లు పొయ్యి మీద పడేసి అలమరలోని డబ్బాలోంచి రెండు బిస్కట్లు తీసుకుని ఆరగించసాగాడు. ఇంతలోనే ముందుగదిలో నుండి భార్య కవిత గొంతు కంగారుగా వినిపించింది.

'మీ డాడీ వచ్చారా కన్నా?'

'ఇప్పుడే వచ్చారు మమ్మీ' కొడుకు సమాధానం.

వంటింట్లోకి అడుగు పెడుతూనే 'ఎంత సేపయింది వచ్చి? మీరు వచ్చేసరికి రావచ్చులే అని బజారుకు వెళ్లాను. ఎల్లుండి సరళ కూతురు పుట్టిన రోజట. డ్రస్ తెద్దాం తోడు రమ్మంటే వెళ్ళానండి. మీకు ఆకలిగా ఉండి ఉంటుంది. స్నానం చేసి రండి. ఈలోగా వంట చేస్తాను' అన్నది కవిత సంజాయిషీగా.

రెండు వారాల తర్వాత మళ్లీ దాదాపుగా అదే సీను ప్రత్యక్షమయింది రవి ఇల్లు చేరుకునే సరికి. ఈసారి ఇంకా కాస్త ఆలస్యంగా ఇల్లు చేరిన కవిత చెప్పిన కారణం 'సత్య ఇంటి ఖర్చులకు ప్రతినెలా వాళ్లాయన ఇచ్చే డబ్బులో కొంత కూడ బెట్టిందట. దిద్దులు కొనుక్కుందాం బంగారం షాపుకు రమ్మంటే వెళ్ళానండి. మీకేం ఇబ్బంది కలుగలేదు కదా!

ఆ తర్వాత వారానికి కమలతో చీరలు కొనుక్కోటానికి చార్మినార్ వెళ్లడం, ఇంకా ఆలస్యంగా రావటం— ఈ విధంగా రాను రాను తరచుగా సాయంత్రాలు కవిత గైరు హాజరు కావటం, తానంతట తానే ఏదో సంజాయిషీ చెప్పటం మామూలయిపోయింది. ఆఫీసు నుండి రాగానే చిరునవ్వుతో ప్రేమగా స్వాగతమిచ్చే తన అర్ధాంగి ఈ విధంగా తననూ, పిల్లల్నీ కూడా నిర్లక్ష్యం చేసి అలా వాళ్లతో వీళ్లతో బజార్లకు తిరగటం రవికి ఎంతో మనస్తాపాన్ని కలిగించినా బయటపడి ఆమెను పల్లెత్తుమాట అనలేదు, కనీసం మందలించనైనా మందలించలేదు. అంతా కాలానికే వదిలేసి తాను నిమిత్తమాత్రుడ్ని అనే ధోరణిలో సహించి ఊరుకోవటం అలవరచుకున్నాడు.

ఒకరోజు ఆఫీసు నుండి షేర్లు కొనడానికని కొంత డబ్బు ఇంటికి తీసుకొచ్చాడు రవి. ఆ డబ్బును కవిత చేతికిచ్చి బీరువాలో దాయమన్నాడు. ఒక వారం తర్వాత ఆఫీసుకు బయల్దేరేటప్పుడు ఆ డబ్బు పట్టుకురమ్మని కవితను అడిగాడు. ఆమె 'అలాగే, ఉండండి ఇస్తాను... ముందు మీరు భోజనం కానీయండి' అంది. భోజనం అయ్యాక ఇవ్వమంటే, వస్తున్నా, వస్తున్నా, అంటూ ఏదో వంటింట్లో సర్దుతుంది తప్ప ఎంతకూ బయటకు రావడం లేదు. చివరకు రవి 'ఆఫీసుకు లేటవుతుంది త్వరగా ఇవ్వు' అనగానే ఏదో భయం భయంగా దగ్గరకు వచ్చి, నానుస్తూ చెప్పసాగింది—

'ఆ డబ్బు... మరే... పాపం... కల్యాణి వాళ్లాయనకు మొన్న స్కూటరు యాక్సిడెంట్ అయిందండి. హాస్పిటల్లో చేర్పించారు. మందులకు డబ్బు కావాలంటే ఏదో స్నేహితురాలు ఇబ్బందుల్లో ఉందని ఆ డబ్బు ఇచ్చానండి. మిమ్మల్ని అడిగినా మీరు మాత్రం కాదంటారా అనే నమ్మకంతోనే ఈ పని చేశానండి. ఈరోజు వెళ్లి తీసుకొస్తాను. ఒక్క రోజుకు కాస్త సర్దుకోండి' అంది గోముగా. రవికి ముందు ఇదంతా కాస్త చికాకనిపించినా 'స్నేహితులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆదుకొనడమే స్నేహధర్మం' అనుకొని సరే, ఇప్పుడు చేయగలిగింది మాత్రం ఏముంది కనుక, భార్యామణిమీద కోపం తెచ్చుకోకుండా మౌనంగా ఆఫీసుకు వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు రవి ఆఫీసుకు బయలు దేరుతుంటే ఇచ్చిన డబ్బులో సగమే అతని చేతిలో పెట్టి మళ్లీ తన స్నేహితురాలి జాలి కథ మొదలు పెట్టింది కవిత.

'పాపం అతను ఇంకా హాస్పిటల్ లోనే ఉన్నాడండి. ప్రస్తుతానికి ఇంతే ఇచ్చారు. మిగిలినది వీలయినంత త్వరగా ఇస్తానన్నారు' ఏమాత్రం తడబాటు లేకుండా చక్కగా వల్లె వేసింది ఆమె.

రవికి ఈ గోలంతా పెద్ద తలనొప్పిగా ఉన్నా ఎందుకోగాని భార్యను ఏం అనలేకపోయాడు. ఒక్కసారి ఆమెవైపు అనుమానంతో సీరియస్‌గా చూసి నోరు మెదపకుండానే బయటకు నడిచాడు.

సరిగ్గా ఆ సంఘటన జరిగిన నెల రోజులకు ఒక ఆదివారంనాడు టీవి చూస్తూ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండగా అనుకోకుండా




రవి దృష్టి కవిత కుడిచేతిమీద పడింది. ఏదో కొట్టొచ్చినట్లు ఆ చేతిలో మార్పు గోచరించి దతనికి. తీరా పరికించి చూడగా తెలిసింది ఆ చేతికి ఉండవలసిన నాలుగు బంగారు గాజులస్థానే ఒక అరడజను మట్టె గాజులు చోటుచేసుకున్నాయని. పెళ్లయిన కొత్తల్లో మా అమ్మ ఆ బంగారు గాజులకు తోడుగా మరో నాలుగు మట్టె గాజులు వేసుకోమని ఎన్నిసార్లు చెప్పినా, మట్టి గాజులు వేసుకోవటం తన కిష్టం లేదని తెగేసి మరీ చెప్పిన కవిత ఇప్పుడు ఇలా బంగారు గాజులు తీసేసి మట్టె గాజులు వేసుకోవడంలో గల తిరకాసు ఏమిటి పరమేశా! అని బుర్ర గోక్కోవటం మొదలుపెట్టాడు రవి. తొందరపడి ఏం పేలకూడదనుకొని అప్పటికి ఊరుకున్నాడు. రాత్రి పక్క మీదకు చేరాక ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని ప్రేమగా నిమురుతూ, గాజులు సవరిస్తూ, ఎంతో కాజువల్‌గా అన్నాడు రవి, 'ఏంటో శ్రీమతిగారి టేస్ట్ మారిపోయినట్టుంది ఉన్నట్టుండి. బంగారు గాజులు పోయి మట్టె గాజులొచ్చాయి చేతికి'.

'అదా, అవి కొంచెం వల్లబడితేను మెరుగు పెట్టించటానికి ఇచ్చాను. రేవు వెళ్లి తెచ్చేసుకుంటాను' అన్నది కవిత ఏమాత్రం తడబాటు లేకుండా.

రేవు పోయి ఎల్లుండొచ్చింది, ఎల్లుండి పోయి అవుటాలెల్లుండి వచ్చింది. ఈ వారం పోయి పైవారం వచ్చింది. కానీ గాజులు మాత్రం మళ్లీ చేతికి ప్రత్యక్షం కాలేదు. కల్యాణికి ఇచ్చానన్న డబ్బుకు కూడా అదే పరిస్థితి పట్టింది.

ఆరోజు రవి బస్సు దిగి నీరసంగా, కాళ్లీడ్చుకుంటూ ఇంటికొస్తుంటే దారిలో వీధి చివర తెల్లమేడలో కాపురముండే రమణ కలిశాడు.




ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకోవటం అయ్యాక ఏదో ఆ మాటా, ఈ మాటా మాట్లాడుకుంటూ ఇద్దరూ నడుస్తున్నారు. ఇంతలో రమణ ఎంతో సిన్సియర్‌గా అన్నాడు, 'సారీ రవి. మొన్న మీ ఆవిడ డబ్బుకోసం వచ్చినప్పుడు సమయానికి ఇంట్లో డబ్బు లేదు. ఏమీ ఇవ్వలేకపోయాం. తప్పుగా అనుకోవద్దు'. రవికి క్షణకాలం రమణ ఏమంటున్నాడో అర్థం కాలేదు. అర్థం అయ్యాక కవిత వాళ్లింటికెళ్లి డబ్బు అడగటం ఏమిటి? నాకు తెలియకుండా తనకు డబ్బేమవసరమొచ్చింది. ఎంత ఆలోచించినా ఈ గందరగోళమంతా ఏమిటో అర్థం కాలేదతనికి. కానీ చూచాయగా ఎక్కడో, ఏదో తనకు తెలియకుండా జరుగుతుందని మాత్రం గ్రహించగలిగాడు.

స్వతహాగా రవికి మరొకరి దగ్గర అప్పు చేయటమంటే గిట్టదు. తనకు ఉన్నంతలో సర్దుకుపోవటమే కాని ఇతరుల దగ్గర అప్పులు చేసే అలవాటు అతనికి లేదు. అలాంటిది, కవిత వాళ్లింటికెళ్లి డబ్బు అడిగిందంటే తల కొట్టేసినట్లయిందతనికి. 'ఇక ఉపేక్షించి లాభం లేదు. ఈరోజు ఆమెను నిలతీయాలి, నా పరువు గంగలో కలిపేస్తుంది' అనుకుంటూ అవమాన భారంతోనూ, కోపంతోనూ ఇల్లు చేరాడు రవి. వెంటనే భార్యను ఏమీ అనకుండా పిల్లలు నిద్రపొయ్యేదాకా ఎంతో నిగ్రహంతో మౌనవ్రతం పాటించాడు. పిల్లలు నిద్రపోగానే విషయం చెప్పి నిలతీశాడామెను.

'ఏమిటిదంతా? నీకు నాకు తెలియనీ, చెప్ప కూడని డబ్బు అవసరాలేమొచ్చాయి? ఎందుకిలా నన్ను బజారుకీడుస్తున్నావు? నేను. నీకేమైనా లోపం చేస్తున్నానా? నువ్వేదన్నా అడిగితే కాదన్నానా? అసలు ఏం జరుగుతుంది? డబ్బంతా ఏం చేస్తున్నావు? నీకేదన్నా సమస్య ఉంటే, ఎవరన్నా ఇబ్బంది పెడుతుంటే నాతో చెప్పవచ్చు కదా, నేను చూసుకుంటాను. నాకు అసలు విషయం ఇప్పుడే ఈ క్షణమే తెలియాలి చెప్పు, నిజం చెప్పు' అగ్నిపర్వతంలా నిప్పులు కురిపిస్తూ బోనులో నిలబెట్టిన ముద్దాయిని ప్రశ్నించినట్లు ప్రశ్నించాడు రవి.

ఈ హఠాత్పరిణామానికి ఆమె నిశ్చేష్టురాలయింది. ముఖం నెత్తురు చుక్క లేకుండా తెల్లగా పాలిపోయింది. కాసేపు నోటమాట రాలేదు. తర్వాత తేరుకుని కళ్లనీళ్లు కుక్కుకుంటూ, తటపటాయిస్తూ చెప్పసాగింది.

'... అది కాదండీ... తెలిసిన వాళ్లు కావాలంటేనూ... '

'నీ అబద్ధాలిక కట్టిపెట్టు. నేను అమాయకుడ్ని కావచ్చు కాని నీ కాకమ్మ కబుర్లన్నీ నమ్మేటంత అమాయకుడ్ని మాత్రం కాదు. నువ్వేదో చాటుమాటు వ్యవహారం నడుపుతున్నట్లున్నావు. ఇక నీ ఆటలు సాగవు. చెప్పు? ఏం చేస్తున్నావు?' అగ్ని పర్వతం ఒక్కసారే బద్దలయింది.

'నేను చెప్పేది నిజమేనండి. నన్ను.. నన్ను... నమ్మరా మీరు? నా కెందుకు డబ్బు... ఏదో.. తల వంచుకొని గాద్గదిక స్వరంతో అన్నది కవిత. అతని కళ్లలోకి చూడలేకపోయింది. అతడు ఒక్క ఉదుటున కవిత చెయ్యిని లాగి పక్కనే అమాయకంగా నిద్రిస్తున్న కూతురి తల మీద పెట్టి 'ఇప్పుడు చెప్పవే, నువ్వు చెప్పేదంతా నిజమేనని?'

కవిత ఇంగుతిని చేతిని వెనక్కు లాక్కుంది. 'పిల్లలెందుకు మధ్యలో. నిజమేనంటున్నాను కదా' అంటూ అక్కడనుండి కళ్లు తుడుచుకుంటూ పక్క గదిలోకి వెళ్లి కొడుకు పక్కన పడుకుంది.

రవికి ఆమె చెప్పేదంతా అబద్ధమేనని గట్టి నమ్మకం కలిగింది కాని ఇతమిద్ధంగా ఆమె చేస్తున్న పని ఇదీ అని మాత్రం తెలియట్లేదు. 'ఈ మిస్టరీని ఎలాగైనా చేధించాలి. ఈ మహారాణి చేసే రాచకార్యాలకు మంగళం పాడేయకపోతే పరిస్థితి విషమించే ప్రమాదముందనుకున్నాడు రవి. ఆ రాత్రంతా ఆలుమగలిద్దరూ చెరొక గదిలో జాగారం చేశారు.

ఆ మర్నాడు లేచిందగ్గరి నుండి వారిద్దరి మధ్య మాటలు కలవటం కానీ, చూపులు కలవటం కానీ జరగలేదు. ఎవరి ఆలోచనల ప్రవాహంలో వారు ఈదులాడుతూ యాంత్రికంగా కాలం గడిపారు. అలా చాలా బరువుగా, సుదీర్ఘంగా ఒక వారం గడిచింది. ఆదివారం ఇంట్లోనే ఉన్నా అతడు ఆమెవైపు చూడటం గానీ, మాట్లాడటం గానీ చేయలేదు. తనపై అతనికున్న అనురాగమంతా ద్వేషంగా మారినట్లు తెలుసుకోగలిగిందామె. తనకు ప్రాణపదమైన భర్తను మనఃక్షోభకు గురిచేయటం ఆమెకిష్టంలేదు. రేపట్లోగా ఈ కథకు ఏదో ఒక ముగింపు ఇవ్వాలనే గట్టి నిర్ణయానికొచ్చిందామె.


ఆరోజు సాయంత్రం యథాప్రకారంగా రవి న్యూస్ పేపరులో తలను చాటు చేసుకుని కూర్చొని ఉన్నాడు. ఆమె వంట పనిలో నిమగ్నమై వుంది. ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. రవి పేపరు పక్కన పెట్టి లేచాడు తలుపు తీయటానికి. ఆమె కూడా ఎవరయి ఉంటారబ్బా అనుకుంటూ ఇవతలకు

## మాధురీ దీక్షిత్

## బెడ్‌రూమ్ విషయాలు

దాదాపు పదమూడు సంవత్సరాలుగా హీరోయిన్‌గా చలామణీ అవుతున్న మాధురీ దీక్షిత్‌కి ఈమధ్య కాలంలో సరైన హిట్టు లేకపోయే సరికి ఇక తనపని అయిపోయిందని అందరూ అనుకుంటున్నారు. కానీ నాలుగు గోడల మధ్య మాధురి తన బెడ్‌రూమ్‌లో చేసిన పనులన్నీ ఓ పత్రికలో రావడంతో దేశం మొత్తం మీద పత్రికలన్నీ మళ్ళీ మాధురి మీద కన్నేశాయి. నా సొంత వ్యవహారాలన్నీ నేషనల్ న్యూస్ చేసేస్తారెందుకో అని కోపం వస్తోంది మాధురి.

వచ్చింది. తలుపు తీయగానే ఎదురుగా ఒక పోలీస్ కానిస్టేబులు నిల్చొని ఉన్నాడు. 'కవిత గారిల్లు ఇదేనా?' అడిగాడు. కవిత ఆందోళనగా ముందుకొచ్చి అవునని తలాడించింది. 'మిమ్మల్ని మా ఇన్‌స్పెక్టర్ గారు అర్జంటుగా స్టేషనుకు రమ్మన్నారు', చెప్పాడతడు. రవి, కవిత ఒక్కసారిగా భయంతోనూ, ఆందోళనతోనూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కవిత భయం భయంగా, కొద్దిగా కంపిస్తూ, అడిగింది కానిస్టేబుల్ని– 'ఎందుకూ?' 'ఏమో, నాకు తెలియదు' అన్నాడతను ఎంతో నింపాదిగా. తనను స్టేషన్‌కు రమ్మనటానికి గల కారణం ఏమిటో కవితకు అర్థం కాలేదు. తానేం నేరం చేసినట్లు! స్టేషనులో ఎటువంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందో! ఆమె పాదాల క్రింద భూమి కంపించింది. వళ్లంతా చెమటలు పట్టింది. గుండె అతి వేగంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.




రవికి కూడా పరిస్థితి ఏం అర్థం కాలేదు. ఆవిడ ఏం ముప్పు తీసుకొచ్చి పెట్టిందో! ఇంకా ఎన్ని అవమానాలు పడాల్సి ఉందో! అంతా నా ఖర్మ కాకపోతే ఏమిటిదంతా! నా సంసారం ముందు బజారుపాలు, ఇప్పుడు పోలీసుస్టేషను పాలు అయింది. అంతా నాదే తప్పు. దాన్ని మొదటిరోజే దండించి అదుపులో పెడితే పోయేది. లేదా, చూస్తూ ఊరుకోకుండా, వాళ్ళవాళ్లకు చెప్పి వదిలించుకున్నా పోయేది. ఇప్పుడిక వాపోయి ఏం ప్రయోజనం. రేపటిరోజు రాకుండా కాలం ఈ రోజుతోనే ఆగిపోతే ఎంత బాగుండును! ఎంతో ఆవేదనగా, ఆక్రోశంగా అనుకున్నాడు రవి. ఇప్పుడు తన ప్రస్తుత కర్తవ్యం ఆమెను తీసుకొని పోలీసు స్టేషనుకు వెళ్లటం.



ఆవిడ చేసిన ఘనకార్యం ఏదైనా తానూ దాని ఫలితాలను అనుభవించాల్సి ఉంటుంది. భార్య వైపు అసహ్యంతోనూ, చీదరింపుతోనూ ఒక్క చూపు చూశాడు, కానీ ఏం మాట్లాడలేదు. బిక్కు బిక్కు మంటూ నిలబడి చూస్తున్న పిల్లలిద్దర్నీ ఇంట్లోనే ఉండమని చెప్పి స్టేషనుకు బయలు దేరారిద్దరూ.

భయం భయంగా స్టేషనులో అడుగుపెట్టి ఇన్‌స్పెక్టర్‌కు తమను తాము పరిచయం చేసుకున్నారు వారు. అతని ముఖంలో భావాల్ని చదవటానికి ప్రయత్నించారిద్దరూ ఏదన్నా క్లూ దొరుకుతుందేమోనని. కాని వారికి నిరాశే ఎదురయింది. ఎటువంటి ఉపోద్ఘాతం లేకుండా ఆ ఇన్‌స్పెక్టర్ డ్రాయరు నుండి నాలుగు బంగారు గాజులు తీసి కవితవైపు తిరిగి 'ఇవి మీవేనా?' అని అడిగాడు. ఇన్నాళ్ళుగా తనకూ వాటికీ రుణం తీరిపోయిందనుకుంటున్న కవిత ఎదురుగా తన గాజులు కనిపించేసరికి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ అవునన్నది. ఇన్‌స్పెక్టర్ రిజిష్టరులో ఆమె సంతకం తీసుకొని వాటిని ఆమెకు ఇచ్చేశాడు. అసలు విషయం ఏమిటో, కవిత గాజులు ఇక్కడికెట్లా వచ్చాయో అర్థం కాక తికమక పడిపోతున్న రవి నుద్దేశించి ఇన్‌స్పెక్టర్ విషయమంతా వివరించాడు.

"ఈరోజు ఉదయం చీటింగు కేసు కింద దామోదర్ అనే వ్యక్తిని అరెస్టు చేశాం. అతని దగ్గర నుండి మేం స్వాధీనం చేసుకున్న వస్తువులలో మీ వస్తువులు కూడా ఉన్నట్లు తెలుసుకున్నాం. ఈ దామోదర్ పచ్చి మోసగాడు. అమాయకులైన గృహిణులకు తాను తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గం చూపిస్తానని ప్రలోభపెట్టి, తన కల్లబొల్లి కబుర్లతో డబ్బు, దస్కం కాజేస్తుంటాడు. వీడికి నలుగురు ఆడ అసిస్టెంట్లు కూడా ఉన్నారు. వాళ్లు ఆడవాళ్లను బుట్టలో పడేయటంలో వాడికి శాయశక్తులా సహాయం చేస్తుంటారు. ఒక్కసారి వీడి ఊబిలో పడితే ఇక బయటకు రావటం కష్టం. వీడి వలన ఎంతోమంది అమాయకులు తమ కుటుంబాలకు దూరమైపోయారు. కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. మాకు వీడిమీద ఎన్నో కంప్లెయింట్స్ వచ్చాయి. అయినా ఈరోజు దాకా మా ముందే తిరుగుతూ మాకు దొరకకుండా కథ నడిపించాడీ రాస్కెల్. ఇన్నాళ్లకు వాడి పాపం పండింది. ఎంతోమంది అమాయక స్త్రీల ఉసురు పోసుకున్నాడీ వెధవ. వాడికి ఏ కీలుకాకీలు ఇరక్కొట్టి ఈ జన్మలోనే కాదు, మరే జన్మలోనూ ఇటువంటి పనులు చేయకుండా బుద్ధి చెపుతాం. ఇంక మీకేం భయం లేదు వెళ్ళండి మేడమ్. ఇంకెప్పుడూ డబ్బాశకు పోయి ఇలాంటి వెధవల వలలో చిక్కుకోకండి."

కవితకూ, రవికీ గుండెల మీద నుండి పెద్దభారం దిగిపోయినట్లనిపించింది. గత కొన్నాళ్లుగా ఇద్దరూ ఒంటరిగా అనుభవించిన మనస్తాపమంతా మంచులా కరిగిపోయింది. ఇద్దరి కళ్లలోనూ ఆనంద భాష్పాలు నిండుకోగా ఇన్‌స్పెక్టర్‌కు థాంక్స్ చెప్పి, చేతిలో చెయ్యి వేసుకుని బయటకు నడవారా దంపతులు.